

ఉత్తర చెన్నై అభివృద్ధి పథకాలకు ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఓట్ల కోసమే ప్రధాని యాత్రలు

సీఎం స్టాలిన్ విమర్శ ● ఉత్తరచెన్నైలో రూ.4181కోట్ల అభివృద్ధి పథకాల ప్రారంభం

ప్యారీస్, మార్చి 14: ప్రధాని నరేంద్రమోదీ ఓట్లు దండుకునేందుకు రాష్ట్రానికి పదే పదే వస్తున్నారని, నగరంలో సంభవించిన వరద ప్రభావిత ప్రాంతాలను ఒక్కసారి కూడా పరిశీలించని ఆయనకు ఉన్నట్టుండి రాష్ట్ర ప్రజలపై ప్రేమ పుట్టుకురావడం వింతగా ఉందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ యెద్దేవా చేశారు. గురువారం మింట్ సమీపంలోని ప్రభుత్వ ముద్రణాలయం ప్రాంగణం వద్ద ఏర్పాటైన సభలో రూ.4181కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పథకాలను ఆయన ప్రారంభించారు. ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృది చేసి, మతవాద శక్తుల పిడికిలి నుంచి దేశాన్ని కాపాడుకోవడమే తమ లక్ష్యమన్నారు. సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన చెన్నై నగరానికి అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధిపరచేలా కృషి చేయాలని, సీఎండీఏ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, ప్రభుత్వ శాఖల అధికారులు తన ఉత్తర్వులను పాటిస్తున్నారని తెలిపారు. హిందూ దేవాదాయ శాఖ మంత్రిగా, సీఎండీఏ ఛైర్మన్‌గా ఉన్న పీకే శేఖర్‌బాబు తక్కువ వ్యవధిలోనే ఉత్తర చెన్నై అభివృద్ధి పనులను పూర్తి చేశారని, ఈ ప్రారంభోత్సవంలో పాల్గొనడం వల్ల నగరంతో డీఎంకేకు ఉన్న సంబంధాలు మళ్ళీ గుర్తుకు వస్తున్నాయన్నారు. డీఎంకే ఆవిర్భవించిందీ ఉత్తర చెన్నైలోనే అని, అదే విధంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, నగర మేయర్‌గా, మంత్రిగా వ్యవహరించింది కూడా ఈ ప్రాంతం నుంచేనని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలో బలమైన కూటమి ఏర్పడిందని, ఆ కూటమిని పుదుచ్చేరి సహా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్, తంగం తెన్నరసు, ఎంపీలు దయానిధి మారన్, కళానిధి వీరాసామి, ఎమ్మెల్యేలు పరంధామన్, ఎబినేజర్, తాయగం కవి, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, జోన్ ఛైర్మన్ పి.శ్రీరాములు, కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్, నగరాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కాకర్ల ఉషా, స్థానిక సంస్థల నిర్వాహక తాగునీటి సరఫరా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అన్షుల్ మిశ్రా సహా ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్నియాకుమారికి మోదీ

● భారీ భద్రతా ఏర్పాట్లు



కన్నియాకుమారి హెలిపాడ్ వద్ద జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు, ప్రభుత్వ అతిథిగృహం వద్ద బందోబస్తు

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కన్నియకుమారికి విచ్చేయనున్నారు. బీజేపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో గణనీయమైన సీట్లను సాధించాలన్న పట్టుదలతో బీజేపీ ప్రయత్నాలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రధాని రాష్ట్రంలో వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఇటీవలే ఆయన తిరుప్పూరు, తిరునల్వేలి, చెన్నైలో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించి పాలకపక్షం డీఎంకేపై పలు విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన కన్నియాకుమారిలో పర్యటించనున్నారు. కన్నియాకుమారి సమీపంలోని అగస్తీశ్వరం వివేకానంద కళాశాల మైదానంలో శుక్రవారం జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సభలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ ప్రముఖులు, శాసనసభ్యులు పాల్గొంటారు. ఈ బహిరంగ సభ అనంతరం ప్రధాని తిరువనంతపురానికి బయలుదేరి వెళతారు. మోదీ పర్యటనను పురస్కరించుకున్ని కన్నియాకుమారి అంతటా పోలీసు ఉన్నతాధికారులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. బహిరంగ సభ ప్రాంతం వద్ద ఇప్పటికే ప్రధాని ప్రత్యేక భద్రతా దళం అధికారులు నిఘా వేశారు. రాష్ట్ర పోలీసులు కూడా కళాశాల మైదానం చుట్టూ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం భద్రతా విభాగం అధికారులు హెలికాప్టర్ ట్రయల్ రన్ చేసి పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆ రహదారిలో వాహనాల రాకపోకలపై నిషేధం అమలు చేయనున్నారు. కన్నియాకుమారి పర్యటన ముగించుకుని తిరువనంతపురానికి తిరిగి వెళ్ళనున్న ప్రధాని.. మళ్ళీ ఈ నెల 18న సేలంలో, 19న కోయంబత్తూరులో జరిగే బహిరంగసభలో పాలొనున్న విషయం తెలిసిందే.



మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తిరుమురుగన్‌ను సత్కరిస్తున్న గవర్నర్ తమిళిసై

పుదుచ్చేరి మంత్రిగా తిరుమురుగన్ ప్రమాణస్వీకారం

పుదుచ్చేరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి నూతన మంత్రిగా తిరుమురుగన్ గురువారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. పుదుచ్చేరి మంత్రివర్గంలోని మహిళా మంత్రి చంద్ర ప్రియాంకను గత అక్టోబర్‌లో తొలగించారు. నాలుగు నెలలుగా చంద్ర ప్రియాంక స్థానంలో ఎవరినీ మంత్రిగా నియమించలేదు. ఈ నేపథ్యంలో కారైక్కాల్ నార్త్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఆర్ కాంగ్రెస్ శాసనసభ్యుడు తిరుమురుగన్‌ను కొత్త మంత్రిగా నియమిస్తూ రాష్ట్రపతి ఈ నెల ఒకటో తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుమురుగన్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా ఆయన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను సత్కరించారు. ఆ తర్వాత తిరుమురుగన్ నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్ ప్రకటించారు. ఆ తర్వాత గవర్నర్ తిరుమురుగన్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం తర్వాత తిరుమురుగన్ ముఖ్యమంత్రి రంగస్వామి ఆశీస్సులందుకున్నారు. గవర్నర్ తమిళిసై కొత్త మంత్రి తిరుమురుగన్‌ను సత్కరించారు.





అధికారులతో చర్చిస్తున్న మంత్రి అశ్విని వైష్ణవ్ - న్యూ డిజైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

దేశీయంగా రైలు చక్రాల తయారీ

రైల్వే ఉన్నతాధికారులతో కేంద్రమంత్రి సమీక్ష ● క్వాల్‌కాం న్యూ డిజైన్ సెంటర్ ప్రారంభం

అడయార్, మార్చి 14: దేశీయంగానే దృఢమైన చక్రాలను తయారు చేయడమేకాకుండా, ప్రధాన ఎగుమతిదారుగా కూడా ఉంటుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నగరంలో పర్యటిస్తున్న కేంద్ర రైల్వే మంత్రి దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు, దక్షిణ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ కౌషల్ కిషోర్‌తో పాటు దక్షిణ రైల్వే పరిధిలోని వివిధ జోన్ల అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ రైల్వే ప్రగతి నివేదికను ఏజీఎం కౌషల్ కిషోర్ వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత చీఫ్ సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ ఈ-టీఎస్ఆర్ సిస్టమ్, బ్లాక్ ఆథరైజేషన్ యాప్, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్‌లో డ్రైవింగ్ ఆఫ్ పాయింట్ మిషన్‌పై పైలట్ ప్రాజెక్టుపై డెమో ఇచ్చినట్టు దక్షిణ రైల్వే ప్రధాన ప్రజాసంబంధాల అధికారి బి.గుణనేశన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డిజైన్ సెంటర్ ప్రారంభించిన మంత్రి

స్థానిక తరమణిలోని రామానుజన్ ఐటీ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన క్వాల్‌కామ్ న్యూ డిజైన్ సెంటర్‌ను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం ప్రారంభించారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రైలు చక్రాల తయారీలో ఉపయోగించే ఫోర్జింగ్ ప్రక్రియను తమిళనాడులోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఫోర్జింగ్ కేంద్రంలో రానున్న 16-18 నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. నగర శివారు ప్రాంతమైన గుమ్మిడిపూండిలో ఉన్న ఈ యూనిట్ యేడాదికి 2.5 లక్షల భారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి వుంటుందని చెప్పారు. దేశంలో బ్రాడ్‌గేజ్ మార్గంలో తిరిగే వందేభారత్ రైలును చెన్నై ఐసీఎఫ్‌లో తయారు చేస్తున్నారని తెలిపారు. వందే భారత్ రేక్‌లను ఎగుమతి చేయాలంటే ఇప్పటి నుంచే వచ్చే ఐదేళ్ళ పాటు డిజైన్, టెస్టింగ్, నేషనల్, ఇంటర్నేషనల్ పర్మిషన్ తదితర ప్రక్రియను ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్వాల్‌కామ్ చెన్నై డిజైన్ సెంటర్ ప్రెసిడెంట్, సీఈవో క్రిస్టియానో అమోన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఐటీ సెంటర్ విస్తరణ కోసం రూ.177.27 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టనున్నారు.

ఢిల్లీ వెళ్ళిన గవర్నర్

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం ఉదయం ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. మూడు రోజులపాటు ఆయన ఢిల్లీలోనే బసచేయనున్నారు. శనివారం మధ్యాహ్నం ఆయన నగరానికి తిరిగివస్తారని రాజ్‌భవన్ అధికారులు తెలిపారు. ఢిల్లీలో ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తదితర ప్రముఖులను కలుసుకుంటారని తెలుస్తోంది.

కార్యకర్తలే అన్నాడీఎంకే బలం

● ఎడప్పాడి పళనిస్వామి



అన్నాడీఎంకేలో చేరిన ఇతర పార్టీల నిర్వాహకులతో ఎడప్పాడి పళనిస్వామి, కేపీ మునుస్వామి తదితరులు

ప్యారీస్, మార్చి 14: కార్యకర్తలే అన్నాడీఎంకేకు బలమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నా రు. అన్నాడీఎంకే బహిష్కృతనేత ఒ.పన్నీర్‌సెల్వం వర్గానికి చెందిన తిరువళ్లూర్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి జి.శరవణన్, దక్షిణ జిల్లా కార్యదర్శి ఆర్ముగం సహా డీఎంకే, ఎండీఎంకే పార్టీలకు చెందిన సుమారు 300 మందికి పైగా కార్యకర్తలు గురువారం ఎడప్పాడి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. వారిని పార్టీ కండువతో సత్కరించి సాదరంగా అన్నాడీఎంకేలోకి చేర్చుకున్న సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న పరిస్థితుల్లో అన్నాడీఎంకేను మరింత బలపరిచేందుకు వివిధ పార్టీల నుంచి కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. అన్నాడీఎంకేతో ఓపీఎస్‌కు ఎలాంటి సంబంధాలు లేవని, రెండాకులు గుర్తు స్తంభింపజేస్తామంటూ చేస్తున్న బెదిరింపులకు తాము భయపడే ప్రసక్తే లేదని, సుమారు 2 కోట్ల మందికి పైగా కార్యకర్తలతో పటిష్ఠంగా ఉన్న పార్టీకే రెండాకుల గుర్తు సొంతమన్నారు. పొత్తులపై పీఎంకేతో ఇప్పటి వరకు చర్చల్లో పాల్గొనలేదని, అయితే డీఎండీకేతో మాత్రమే చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. రాజకీయాల్లో మంచి గుర్తింపు కల్పించిన అన్నాడీఎంకేకు వెన్నుపోటు పొడిచి బీజేపీ కూటమిలో చేరిన ఓపీఎస్‌కు, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి దినకరన్ వల్ల అన్నాడీఎంకే ఓటు బ్యాంక్‌కు ఎలాంటి నష్టం ఉండదని, దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత హయాంలో కూడా పలువురు నాయకులు అన్నాడీఎంకే నుంచి వైదొలిగారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లోక్‌సభ ఎన్నికల్లో రెండాకులు గుర్తుపైనే పోటీచేస్తామని ఈపీఎస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నాడీఎంకే ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు జయకుమార్, బెంజిమెన్, కేపీ మునుస్వామి, నత్తం విశ్వనాథన్, దిండుగల్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎమ్మెల్యేగా పొన్ముడి

ప్యారీస్, మార్చి 14: సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం డీఎంకే సీనియర్ నేత మాజీ మంత్రి పొన్ముడి మళ్లీ ఎమ్మెల్యే పదవిలో కొనసాగనున్నారని అసెంబ్లీ స్పీకర్ అప్పావు అధికారికంగా ప్రకటించారు. ఉన్నత విద్యశాఖ మాజీ మంత్రి పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షి ఆదాయానికి మించి అధికంగా రూ.1.75 కోట్ల ఆస్తులు కూడబెట్టారని దాఖలైన కేసులో దిగువ కోర్టు వారిని విడుదల చేస్తూ తీర్పు వెలువరించింది. ఆ తీర్పుకు వ్యతిరేకంగా అవినీతి నిరోధక విభాగం పోలీసులు మద్రాసు హైకోర్టులో అప్పీలుకు వెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, పొన్ముడి దంపతులు నేరస్తులు అని ప్రకటించి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గత డిసెంబరు 21న తీర్పు వెలువరించింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పొన్ముడి దంపతులు అప్పీలు పిటిషన్ దాఖలుచేశారు. ఈ నేపథ్యంలో, అవినీతి కేసులో మూడేళ్ల జైలుశిక్ష విధించిన కారణంగా పొన్ముడి ప్రజా ప్రతినిధుల చట్టం ప్రకారం తన ఎమ్మెల్యే, మంత్రి పదవులు కోల్పోయారు. దీంతో ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన తిరుకోవిలూరు స్థానం ఖాళీ అయినట్లు రాష్ట్ర అసెంబ్లీ కార్యాలయం ఈ నెల 5న ప్రకటించింది. ఇదిలా ఉండగా, పొన్ముడి దంపతుల అప్పీలు పిటిషన్ ఈ నెల 11న సుప్రీంకోర్టులో విచారణకు రాగా, ఈ కేసులో మద్రాసు హైకోర్టు జారీచేసిన జైలుశిక్ష ఉత్తర్వులు తాత్కాలికంగా నిలిపివేస్తూ న్యాయమూర్తుల బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. ఈ తీర్పు కారణంగా పొన్ముడి మళ్లీ ఎమ్మెల్యేగా డిసెంబరు 19 నుంచి కొనసాగుతారని అసెంబ్లీ కార్యాలయం ప్రకటించింది. మరోవైపు పొన్ముడిచే మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించాలని గవర్నర్ ఆర్ఎన్ రవికి ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం సాయంత్రం లేఖ రాశారు. అయితే ముందే వేసుకున్న పథకం ప్రకారం గవర్నర్ గురువారం ఉదయం ఢిల్లీకి వెళ్లినందువల్ల పొన్ముడి ప్రమాణస్వీకార కార్యక్రమం వాయిదాపడింది. ఢిల్లీ నుంచి గవర్నర్ 16వ తేది నగరానికి తిరిగొచ్చాక ఆయన పొన్ముడిచే మంత్రిగా ప్రయాణస్వీకారం చేయిస్తారని సచివాలయ వర్గాలు తెలిపాయి.



సహాయ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

28 నుంచి దరఖాస్తుల స్వీకరణ ● ఆగస్టు 4న రాతపరీక్ష

పెరంబూర్, మార్చి 14: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 4,000 సహాయ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి తమిళనాడు ప్రభుత్వ ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 29వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆగస్టు 4వ తేది రాత పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో సుమారు 10,079 అధ్యాపకులు, 7,500 సహాయ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 11 ఏళ్లుగా ఈ పోస్టులు భర్తీకాని నేపథ్యంలో, 2,331 పర్మినెంట్ సహాయ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ గత 2019లో టీఆర్బీ విడుదల చేసింది. కానీ, న్యాయస్థానంలో కేసులు, ఇతర కారణాలతో పోస్టుల భర్తీ ప్రక్రియ అమలు కాలేదు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుచేసి, అర్హత, బోధనా అనుభవం, ఇంటర్వ్యూల తదితరాలకు అందించే మార్కుల విధానం రద్దు చేసి, రాతపరీక్షకు 200 మార్కులు, ఇంటర్వ్యూకు 300 మార్కులు అందించి సహాయ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ నియామకాలు పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 4 వేల సహాయ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ కానున్నాయి. 2019లో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు తాజాగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అభ్యర్థుల వయసు 2024 జూలై 1వ తేది నాటికి 57 ఏళ్లలోపుండాలి. పీజీలో కనిష్ఠంగా 55 శాతం మార్కులు సాధించాలి. యూజీసీ, సీఎస్ఐఆర్ నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నెట్), స్లెట్, సెట్ తదితరాల్లో ఏదో ఒక దాంట్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అలాగే, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు https://trb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులతో పాటు తగిన సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుందని టీఆర్బీ తెలియజేసింది.

రంజాన్ వేళలు
శుక్రవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26
శనివారం : సహర్ : ఉదయం - 4.35



మాదకద్రవ్యాల వ్యవహారం...

● ఈపీఎస్, అన్నామలైపై సీఎం పరువు నష్టం కేసు

పెరంబూర్, మార్చి 14: మాదకద్రవ్యాల తరలింపు వ్యవహారంలో తన గురించి అసత్య ప్రచారాలు చేశారంటూ, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరువు నష్టం కేసు దాఖలుచేశారు. చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో సీఎం స్టాలిన్ తరఫున చెన్నై కార్పొరేషన్ క్రిమినల్ లాయర్ దేవరాజన్, పళనిస్వామి, అన్నామలైకు వ్యతిరేకంగా పరువు నష్టం కేసు వేశారు. ఈ పిటిషన్‌లో.. మాదకద్రవ్యాల తరలింపు వ్యవహారంలో, జాఫర్ సాదిక్ అరెస్ట్ చేయడానికి సంబంధించి ఈ నెల 8వ తేది పళనిస్వామి విలేఖరుల సమావేశంలో, ముఖ్యమంత్రిగా తనకు సంబంధాలున్నట్లు వ్యాఖ్యానించారని, ఇదే వ్యవహారంపై 'ఎక్స్'లో వీడియో పోస్ట్ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా తన ప్రమేయం ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పలు చర్యలు చేపట్టామని, అలాగే, వీటికి బానిసలు కావద్దని ప్రజలు, యువతను హెచ్చరించేలా అవగాహన ప్రచారాలు చేపట్టామన్నారు. తన పేరు, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన పళనిస్వామి, అన్నామలైపై క్రిమినల్ పరువు నష్టం కింద చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటషన్ త్వరలో విచారణకు రానుంది.

సమాచార ధ్వని

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

ఐసిఎఫ్, మార్చి 14: నెమ్మేలిలో పైప్ లైన్ కనెక్షన్ పనులు చేపట్టనుండడంతో శుక్ర, శనివారాలు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు తెలిపింది. వలసరవాక్కం మండలంలో నందంబాక్కం, నొలంబూర్, వలసరవాక్కం, రామాపురం, అడయార్ మండలంలో వేళచ్చేరి, పల్లిపట్టు, పెరుంగుడి మండలంలో పళ్లికరనై, మడిపాక్కం, ఉల్లగరం, పుళిదివాక్కం, ఆలందూర్, తాంబరం కార్పొరేషన్‌లో పల్లావరం, పమ్మల్, అనకాపుత్తూర్, రాధానగర్ ప్రాంతాల్లో ట్యాంకర్ల లారీల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నారు.

ట్రాఫిక్ మార్పులు ఏడాది పొడిగింపు

ఐసిఎఫ్, మార్చి 14: మెట్రోరైలు పనుల కోసం రాయపేట వైట్స్ రోడ్డులో అమలులో ఉన్న ట్రాఫిక్ మార్పులను పోలీసులు మరో ఏడాది పొడిగించారు. ఈ ట్రాఫిక్ మార్పుల్లో స్వల్ప మార్పులు జరిగాయి. తిరువిక రోడ్డు-బజుల్లాస్ రోడ్డు వరకు ఉన్న వైట్స్ రోడ్డును వన్‌వేగా మార్చారు. రాయపేట క్లాక్ టవర్ నుంచి సత్యం థియేటర్ వైపు వెళ్లేవారు బైజుల్లాస్ రోడ్డు మీదుగా అన్నాసాలై, తిరువిక రోడ్డు వెళ్లాలి. థౌజండ్ లైట్స్, అన్నాసాలై నుంచి సత్యం థియేటర్ మీదుగా వచ్చే వాహనాలు యధావిధిగా తిరువిక రోడ్డు-వైట్స్ రోడ్డు మీదుగా వెళ్లవచ్చు.

క్రీడాకారులకు ఉచిత విద్య

ఐసిఎఫ్, మార్చి 14: కాటాన్‌కొళత్తూర్ ఎస్ఆర్ఎం కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో స్పోర్ట్స్ కోటాలో ప్రవేశాలకు ఎంపిక శిబిరం ఏప్రిల్ 4 నుంచి 10వ తేదీ వరకు జరుగనుంది. ఇంజనీరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఏప్రిల్ 4న చెస్, బాడ్మింటన్, 5న వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, 6న అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, 7న బాస్కెట్ బాల్, వాలీబాల్ అని ఒక్కో రోజు ఒక్కో విభాగానికి చెందిన విద్యార్థులకు శిబిరాలు నిర్వహించనున్నారు. వివరాలకు 9043889551, 9940418484 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

సముద్రంలోకి తాబేలు పిల్లలు

ఐసిఎఫ్, మార్చి 14: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు సముద్రంలో తాబేలు పిల్లలను అటవీ శాఖ అధికారులు వదిలిపెట్టారు. ఈ సముద్రతీరంలో ప్రతి సంవత్సరం నవంబరు-మార్చి నెలల్లో ఆలివర్ రెడ్లీ తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పెట్టి వెళుతుంటాయి. వాటిని సేకరించిన అటవీ శాఖ సిబ్బంది ప్రత్యేక విధానంలో పొదిగించి పిల్లలను సురక్షితంగా సముద్రంలో వదిలిపెడుతుంటారు. డిసెంబరులో సేకరించిన గుడ్ల నుంచి 9,000 తాబేలు పిల్లలను మంగళవారం రాత్రి సముద్రంలోకి తీసుకెళ్లి వదిలిపెట్టారు.

'కలైంజర్ ఎళుదుపోల్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మార్చి 14: కలైంజర్ ఎళుదుపోల్ పురస్కారానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి రోజైన జూన్ 3వ తేది ఉత్తమ జర్నలిస్టులకు ఈ పురస్కారం అందజేసి ప్రభుత్వం సత్కరిస్తోంది. 2023కుగాను పురస్కారాలకు పూర్తి వివరాలతో దరఖాస్తులను 'డైరెక్టర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, సచివాలయం, చెన్నై-9' అనే చిరునామాకు ఏప్రిల్‌లోపు పంపించాలని ప్రభుత్వం తెలిపింది.

రూ.1.85 కోట్లతో కొత్త పథకం పనులు

ఐసిఎఫ్, మార్చి 14: స్థానిక తండయార్‌పేటలో రూ.1.85 కోట్ల వ్యయం తో కొత్త పథకం పనులు ప్రారంభమయ్యాయి. రూ.20 లక్షలతో తండయార్‌పేట పవర్ హౌస్ బస్టాప్, పరమేశ్వరన్ నగర్ బస్టాప్‌లకు షెల్టర్లు, రూ.1.65 కోట్ల వ్యయంతో సత్యానగర్‌లో మినీ స్టేడియం, మరో మూడు ప్రాంతాల్లో మల్టీ పర్పస్ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలల్లో ఈ పనులు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

18 వేల మెగావాట్లకు చేరుకున్న విద్యుత్ వినియోగం

ఐసిఎఫ్, మార్చి 14: రాష్ట్రంలో రోజువారి విద్యుత్ వినియోగం 18,000 మెగావాట్లకు చేరుకున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత కారణంగా గృహాలు, కార్యాలయాల్లో ఏసీల వినియోగం పెరిగింది. ఈ కారణంగా ప్రతిరోజు సగటున 15,000 మెగావాట్లున్న విద్యుత్ వినియోగం ఈ నెల ప్రారంభంలో 17,000 మెగావాట్లు, మంగళవారం 18,000 మెగావాట్లు, బుధవారం 18,150 మెగావాట్లకు పెరిగింది.

ప్రైవేటు పాఠశాలల నిర్వహణకు కొత్త డైరెక్టర్

ఐసిఎఫ్, మార్చి 14: పాఠశాల విద్యాశాఖ ప్రైవేటు పాఠశాలల విభాగం కొత్త డైరెక్టర్‌గా పళనిస్వామి నియమితులయ్యారు. ప్రైవేటు పాఠశాలల శాఖ డైరెక్టర్‌గా ఉన్న నాగరాజ మురుగన్ నిరక్షరాస్యులు, వయోజన విద్య విభాగం డైరెక్టర్‌గా, ఆ పదవిలో ఉన్న పళనిస్వామి ప్రైవేటు పాఠశాలల విభాగం డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కుమరుగురుపరన్ ఉత్తర్వులు జారీచేశారు.

డిపాజిట్‌పై 6.75 శాతం వడ్డీ

ఐసిఎఫ్, మార్చి 14: విద్యుత్ బిల్లు డిపాజిట్‌కు ఇకపై 6.75 శాతం వడ్డీ అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ వినియోగాన్ని బట్టి కర్మాగారాలకు సంవత్సరానికి ఒకసారి, గృహాలకు రెండేళ్లకు ఒకసారి డిపాజిట్లు మారుతుంటాయి. అధిక విద్యుత్ వినియోగం ఉన్న వినియోగదారుల వల్ల అదనంగా డిపాజిట్ వసూలుచేస్తున్న విద్యుత్ బోర్డు, ఆ డిపాజిట్‌కు వడ్డీ ఇస్తుంటారు. ఆ ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 6.75 శాతం వడ్డీ అందజేయాలని విద్యుత్ బోర్డుకు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. గత ఆర్థిక సంవత్సరం వడ్డీ శాతం 5.70గా ఉంది.

మెట్రోరైలులో డైనమిక్ సిస్టమ్

ప్యారీస్, మార్చి 14: ప్రయాణికుల సౌకర్యార్థం నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో డైనమిక్ రూట్ మ్యాప్ సిస్టమ్ (డిజిటల్) పొందుపరచనున్నట్లు చెన్నై మెట్రోరైల్వే లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) తెలిపింది. మెట్రోరైళ్లలో ప్రయాణికులకు వసతులు మెరుగుపరిచేలా సీఎంఆర్ఎల్ చర్యలు చేపట్టింది. ఆ రీతిలో ఈ రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో ఆ రైలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతుంది, ఏఏ రైల్వేస్టేషన్లలో ఆగుతుంది, తాము దిగాల్సిన రైల్వేస్టేషన్ ఎంతదూరంలో ఉంది అన్న సమాచారాన్ని అన్ని బోగీల్లో డిజిటల్ సిస్టమ్‌తో ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. మరో కొన్ని నెలల్లో ఈ పథకానికి సంబంధించి టెండర్లు విడుదల చేసి వచ్చే డిసెంబరులోగా అమలు చేస్తామని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. మెట్రోరైళ్లలో ఉన్న ఉష్ణోగ్రత, రైలు ఎంత వేగంతో వెళుతోంది అన్న వివరాలతో పాటు ఎమర్జెన్సీ టోల్ ఫ్రీ నెంబర్లు కూడా ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

1196మంది కాంట్రాక్టు నర్సుల పర్మినెంట్

● వెల్లడించిన మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా సంక్షోభ సమయంలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన 1196 మంది నర్సులను పర్మనెంట్ చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం వీరికి నియామక ఉత్తర్వులు పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. సైదాపేటలో ప్రభుత్వ సబర్బన్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.15.50 కోట్లతో శిశు చికిత్సా విభాగంలో నిర్మించనున్న అదనపు భవనాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వరుసగా భర్తీ చేస్తున్నామని, గత రెండు నెలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 1021 మంది డాక్టర్లను నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి రాజకీయనాయకుడిలా వ్యవహరిస్తూ ప్రభుత్వం పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, రాష్ట్రంలో ఎక్కడా గంజాయి పెంచడం లేదని, ఆంధ్రప్రదేశ్‌లోనే గంజాయిని విస్తారంగా పెంచుతున్న విషయం అందరికీ తెలిసినదేనని చెప్పారు. గవర్నర్ మాదక ద్రవ్యాల అక్రమరవాణా అంటూ చేస్తున్న ఉత్తుత్తి బెదరింపులకు తాము భయపడే ప్రసక్తే లేదన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం

ప్రచారం ప్రారంభించిన అన్నాడీఎంకే



ప్రసంగిస్తున్న అప్పు

వేలూరు, మార్చి 14: వేలూరు మా నగర్ జిల్లా అన్నాడీఎంకే, ఎంజీఆర్ యువజన విభాగం ఆధ్వర్యంలో ప్రచారాలు చేపట్టారు. కాట్పాడి యూనియన్ పరిధిలోని పొన్నై, తిరువలం, బ్రహ్మపురం తదితర ప్రాంతాల్లో పార్టీ సెక్రటరీ అప్పు, ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జి అముద నేతృత్వంలో ప్రచారం సాగింది. అనంతరం బ్రహ్మపురంలో బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీలు సలాం, సుభాష్, మానగర ఎంజీఆర్ యువజన విభాగం సెక్రటరీ రమేష్, రైతుల విభాగం సెక్రటరీ సుందరరాజ్, బ్రహ్మపురం అన్నాడీఎంకే సెక్రటరీ రామమూర్తి, ప్రకాశం, సెంథిల్‌కుమార్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ



విద్యార్థులను పెన్ అందజేస్తున్న సమాజ సేవకుడు దినేష్ శరవణన్

వేలూరు, మార్చి 14: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సమాజ సేవకుడు దినేష్ శరవణన్ పెన్నులు అందజేశారు. స్థానిక రంగాపురానికి చెందిన ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్, పాఠశాలల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తన సొంత నిధులు అందజేస్తుంటారు. ఈ నేపథ్యంలో, అలమేలు మంగాపురంలోని ప్రభుత్వ ఆదిద్రావిడుల పాఠశాలలో చదువుతున్న 84 మంది పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం దినేష్ శరవణన్ పెన్నులు అందజేసి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు.

నేటినుంచి ఆలయాల్లో భక్తులకు మజ్జిగ పంపిణీ

● మంత్రి పీకే శేఖర్‌బాబు

పెరంబూర్, మార్చి 14: రాష్ట్రవ్యాప్తంగా 48 ఫస్ట్ గ్రేడ్ ఆలయాల్లో భక్తులకు ఉచితంగా మజ్జిగ అందజేయనున్నట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. రాష్ట్రవ్యాపంగా ఎండ తీవ్రత క్రమేణా అధికమవుతోంది. ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, మజ్జిగ సహా శరీరానికి చల్లదనం అందించే పానీయాలను తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మన్నడిలోని పాఠశాలలో నిర్మించిన తరగతి గదులను గురువారం మంత్రి శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో, శుక్రవారం నుంచి రాష్ట్రంలోని 48 ఆలయాల్లో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయనున్నామన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నేలపై మ్యాట్ తదితరాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలు తెలిసిన ముఖ్యమంత్రి కావడంతో, ఎండలు తీవ్రం కాకముందే భక్తుల ఆరోగ్యం దృష్ట్యా మజ్జిగ పంపిణీ చేసే పథకం ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు.

ప్రధానిని బెదిరించేలా మాట్లాడారంటూ...

రాష్ట్ర మంత్రిపై ఢిల్లీలో కేసు నమోదు

పెరంబూర్, మార్చి 14: ప్రధాని నరేంద్ర మోదీకి హత్యా బెదిరింపులు చేసేలా మాట్లాడిన రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదుచేశారు. ఎమ్మెల్‌లో ఈ నెల 8వ తేది జరిగిన డీఎంకే సభలో పాల్గొన్న మంత్రి అన్బరసన్, ప్రధాని మోదీని విమర్శిస్తూ ప్రసంగించారు. అదే సమయంలో, ప్రధానికి హత్యా బెదిరింపు చేసేలా ఆయన ప్రసంగించారని ఆరోపణలున్నాయి. ఈ విషయమై సుప్రీంకోర్టు న్యాయవాది సత్యరంజన్ స్వైన్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో, ప్రధాని ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా మాట్లాడిన మంత్రి అన్బరసన్‌పై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు. దీంతో, మంత్రి అన్బరసన్‌పై అల్లర్లు ప్రేరేపించడం, విద్వేషపూరిత ప్రసంగాల ద్వారా హింసను ప్రేరేపించడం సహా నాలుగు సెక్షన్ల కింద ఢిల్లీ పోలీసులు కేసు నమోదుచేశారు.

లబ్ధిదారులకు సహాయాల పంపిణీ



సహాయాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 14: ఆనైకట్టు డివిజన్ సేర్పాడి గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎమ్మెల్యే నందకుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో 309 మంది లబ్ధిదారులకు రూ1.02 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు, ఆనైకట్టు యూనియన్ అధ్యక్షుడు భాస్కరన్, యూనియన్ కమిటీ సభ్యుడు ప్రకాష్, సేర్పాడి పంచాయతి అధ్యక్షులు జమున, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తీ, ప్రత్యేక సబ్ కలెక్టర్ కలియమూర్తి, వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత, ఆనైకట్టు తహసీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం కార్యవర్గ సమావేశం

పెరంబూర్, మార్చి 14: సీపీఎం కార్యవర్గ సమావేశం శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరుగనుంది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో పోటీచేయనున్న సీపీఎంకు మదురై, దిండుగల్ స్థానాలు కేటాయించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో మదురై, కోయంబత్తూర్ నుంచి పోటీచేసిన ఆ పార్టీ అభ్యర్థులు రెండు స్థానాల్లో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూటమిలో సీట్ల సర్దుబాటు కారణంగా కోయంబత్తూర్‌కు బదులుగా దిండుగల్ నియోజకవర్గాన్ని సీపీఎంకే కేటాయించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో పోటీచేయనున్న అభ్యర్థుల ఎంపికకు సంబంధించి శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ నేతృత్వంలో కార్యవర్గ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆస్పత్రిలో చేరిన అళగిరి కుమారుడు



దురై దయానిధి

పెరంబూర్, మార్చి 14: మాజీ కేంద్ర మంత్రి ఎంకే అళగిరి కుమారుడు దురై దయానిధి హఠాత్తుగా అస్వస్థతకు గురికావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నేపథ్యంలో, మెరుగైన వైద్యచికిత్స కోసం ఆయనను గురువారం వేలూరులోని ప్రముఖ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఆయనకు చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

అగ్నికలశం తొలగింపును వ్యతిరేకిస్తూ

పీఎంకే, వన్నియార్ల సంఘం ఆందోళన



మోటారు బైకుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న పీఎంకే, వన్నియార్ల సంఘం కార్యకర్తలు

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై సమీపం నాయుడు మంగళం ప్రాంతంలో పీఎంకే వ్యవస్థాపకుడు 1989లో ప్రతిష్ఠించిన అగ్నికలశాన్ని తొలగించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ గురువారం ఉదయం పీఎంకే, వన్నియార్ల సంఘం నాయకులు, కార్యకర్తలు బైకు ర్యాలీతో నిర్వహించారు. రెండేళ్ల క్రితం నాయుడు మంగళం వద్ద బస్టాండు నిర్మిస్తున్న సందర్భంగా అక్కడి అగ్ని కలశాన్ని అధికారులు తొలగించారు. బస్టాండు నిర్మాణం పూర్తయిన తర్వాత అదే ప్రాంతంలో ఆ అగ్ని కలశాన్ని ప్రతిష్ఠిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే అధికారులు మాట ప్రకారం అగ్ని కలశాన్ని ఆ చోట ప్రతిష్ఠించకపోవడంతో పీఎంకే స్థానిక నేతలు కొత్తగా అగ్ని కలశం తయారు చేసి ప్రతిష్ఠించారు. మరుసటి రోజూ అధికారులు దానిని తొలగించారు. దీనితో అగ్నికలశం తొలగింపును వ్యతిరేకిస్తూ వన్నియార్ల సంఘం, పీఎంకే కార్యకర్తలు సుమారు మూడు వేల మంది మోటారు బైకులు, సైకిళ్లలో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా తిరువణ్ణామలై - నాయుడు మంగళం రహదారిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఉడుమలైపేటలో మొసలి సంచారం



కొళుమం చెక్‌పోస్టు రహదారిలో సంచరిస్తున్న మొసలి

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉడుమలైపేట సమీపంలోని కొళుమమం గ్రామంలో బుధవారం రాత్రి ఓ పెద్ద మొసలి రోడ్డుపై సంచరించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల అమరావతి జలాశయం నుంచి సాగునీటి కాల్వల ద్వారా నీటిలో మొసళ్లు కొట్టుకు వచ్చి జననివాస ప్రాంతాల్లో సంచరిస్తున్నాయని ఆయా ప్రాంతాలవారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొళుమమం గ్రామం చెక్‌పోస్ట్ సమీపంలో రోడ్డుపై ఓ మొసలి సంచరించడాన్ని కొందరు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనితో అటవీ శాఖ అధికారులు ఆ మొసలిని పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నారు.

డీఎంకే మహిళా కౌన్సిలర్ డిస్మిస్



నళిని గురునాథన్

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు పురపాలక సంఘం పదో వార్డుకు చెందిన డీఎంకే మహిళా కౌన్సిలర్ నళిని గురునాథన్‌ను పదవి నుంచి తొలగిస్తూ కమిషనర్ గణేశన్ ఉత్తర్వు జారీ చేశారు. నళిని భర్త గురునాథన్ మున్సిపాలిటీలో పారిశుధ్య పనులకు సంబంధించిన టెండర్లు దక్కించుకున్నారని, ఇక నళిని నామినేషన్ అఫిడవిట్‌లో గురునాథన్ కార్మికుడిగా ఉన్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపణలు రావటంతో ఈ చర్య తీసుకున్నట్లు కమిషనర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. తనను కమిషనర్ డిస్మిస్ చేయనున్నట్లు తెలుసుకున్న కౌన్సిలర్ నళిని మున్సిపల్ చైర్మన్ మూర్తికి రాజీనామా సమర్పించారు. అనారోగ్య కారణాల వల్ల కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అదే సమయంలో పదో వార్డు కౌన్సిలర్ పదవి ఖాళీగా ఉన్నట్లు మున్సిపల్ వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన జారీ చేశారు.

ఆరు వర్సిటీలకు యూజీసీ నోటీసు

ఐసిఎఫ్, మార్చి 14: ట్రిబ్యునల్ ఏర్పాటుచేయని రాష్ట్రంలోని ఆరు విశ్వవిద్యాలయాలకు యూజీసీ నోటీసులు పంపింది. అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థుల భద్రత, మౌలిక వసతుల కల్పనకు తప్పనిసరిగా ట్రిబ్యునల్ ఏర్పాటుచేయాలని యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు జారీ చేసి ఏడాది దాటినా రాష్ట్రానికి చెందిన అన్నామలై, భారతిదాసన్, తిరువళ్లువర్ విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్, క్రీడా వర్సిటీ, తమిళ విశ్వవిద్యాలయం, తమిళనాడు డా.జయలలిత సంగీత లలిత కళల విశ్వవిద్యాలయాలు ట్రిబ్యునల్ ఏర్పాటుచేయకపోవడంతో, ఆ వర్సిటీలకు యూజీసీ నోటీసులు జారీచేసింది.

తమిళంలో నేమ్ బోర్డు లేకుంటే రూ.1,000 జరిమానా

ఐసిఎఫ్, మార్చి 14: వచ్చే నెలలోగా తమిళంలో నేమ్ బోర్డు ఏర్పాటుచేయని దుకాణాలు, వాణిజ్య సంస్థలకు రూ.1,000 జరిమానా విధించనున్నట్లు తమిళ అభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వాణిజ్య సంస్థలు, దుకాణాలకు తమిళంలో నేమ్ బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇతర భాషల్లో పేర్లు రాయదలచుకుంటే, తమిళంలో పెద్దదిగా, ఆంగ్లం, ఇతర భాషల్లో 5:3:2 నిష్పత్తిలో అక్షరాలు రాయాలని సూచించింది. ఏప్రిల్‌లోగా ప్రభుత్వ ఉత్తర్వులు అమలుపరచని పక్షంలో రూ.1,000 జరిమానా విధించనున్నట్లు అధికారులు హెచ్చరించారు.

జైన్ ఆలయ సమీపంలో మాంసం దుకాణం తొలగించాలనే పిటిషన్ వాపసు

పెరంబూర్, మార్చి 14: స్థానిక చూలైలో ఉన్న జైన్ ఆలయ సమీపంలోని మాంసం దుకాణం తొలగించాలని కోరుతూ దాఖలుచేసిన పిటిషన్ వాపసు తీసుకొనేందుకు అనుమతించాలనే అభ్యర్థనను మద్రాసు హైకోర్టు, పరిగణలోకి తీసుకుంది. ఈ ఆలయ నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న అఖిల భారతీయ సద్ హరామ్ జైన్ సాంస్కృతి రక్షక్ ట్రస్ట్ తరపున హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో, ఆలయ సమీపంలో ఉన్న మాంసం దుకాణం తొలగించాలని కోరింది. ఈ పిటిషన్ గురువారం విచారించిన న్యాయస్థానం... నిషేధిత చట్టం, నిబంధనలు లేనప్పుడు దుకాణం తొలగించాలని ఎలా ఆదేశిస్తారని పిటిషనర్‌ను ప్రశ్నించింది. దీంతో, పిటిషన్ వాపసు తీసుకుంటున్నట్లు పిటిషనర్ తరపున న్యాయవాది విజ్ఞప్తి పరిశీలించిన ధర్మాసనం, అందుకు అనుమతిస్తూ, పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

తాగునీటి శాఖ ఉద్యోగుల ఆందోళన



ఆందోళనలో ఉద్యోగులు

వేలూరు, మార్చి 14: స్థానిక కాట్పాడి ఓడ పిళ్లయార్ ఆలయ సమీపంలో ఉన్న తమిళనాడు తాగునీటి బోర్డు ప్రధాన ఇంజనీర్ కార్యాలయం వద్ద ఆ సంస్థ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సెల్వం నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనల్లో... పనిగంటలకు సమాన వేతనం, బ్యాంక్ ద్వారా జీతాల చెల్లింపు సహా పలు డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు బాలాజీ సహా వంద మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

తిరుమంగళం హోటల్‌లో 17 మంది రౌడీల అరెస్టు

● 3 తుపాకులు, 14 తూటాల స్వాధీనం

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ తిరుమంగళంలోని ఓ హోటల్‌లో దాక్కున్న 17 మంది రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 3 తుపాకులు, 14 తూటాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో పాత రౌడీల సంచారంపై నిఘా వేయాలని, అవసరమైతే అరెస్టు చేయాలని పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ అన్ని పోలీసుస్టేషన్లకు ఉత్తర్వు జారీ చేశారు. ఆ మేరకు నగరంలో అన్ని ప్రాంతాల్లో రాత్రుల్లో పోలీసుల గస్తీ తీవ్రతరం చేశారు. ఈ నేపథ్యంలో తిరుమంగళంలోని ప్రముఖ హోటల్‌లో రౌడీ షీటర్లు దాగి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారు హుటాహుటిన అక్కడికి వెళ్లి హోటల్‌ను చుట్టుముట్టారు. సాయుధ పోలీసులు హోటల్‌లో తనిఖీ చేసి అరకోణంకు చెందిన పేరుమోసిన రౌడీ జయపాల్ ఆయన అనుచరులు, తిరునల్వేలికి చెందిన మరో రౌడీ చొక్కలింగం సహా 17 మందిని అరెస్టు చేశారు. వారినుంచి మూడు తుపాకులు, 14 తూటాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో జయపాల్ గత యేడాది జరిగిన రౌడీ సురేష్ హత్యకేసులో ప్రధాన నిందితుడు. పుళల్ జైలులో ఉన్న ఆయన ఇటీవలే బెయిలుపై విడుదల మళ్లీ ఎవరినో హతమార్చేందుకు పథకం వేసుకునేందుకు రౌడీలతో హోటల్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 17 మంది రౌడీలను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

● పోక్సో చట్టం కింద టీచర్ అరెస్ట్

పెరంబూర్, మార్చి 14: సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఉపాధ్యాయుడు పోక్సో చట్టం కింద అరెస్టయ్యాడు. పుదుపాళయం పంచాయతి అరిసిపాళయం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో పనిచేస్తున్న పళనియప్పన్ (42) అనే ఉపాధ్యాయుడు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. బాధితుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో కొంకనాపురం పోలీసులు విచారించి, ఉపాధ్యాయుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. దీంతో ఉపాధ్యాయుడు పళనియప్పన్‌ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళపై లైంగిక వేధింపులు

● ఎస్ఐ అరెస్ట్

పెరంబూర్, మార్చి 14: నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎస్ఐ కటకటాలపాలయ్యాడు. స్థానిక జామ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో నేర విభాగం ఎస్ఐగా భారతిదాసన్ (55) పనిచేస్తున్నాడు. ఆయన ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చిన ఓ మహిళను లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై బాధిత మహిళ మైలాపూర్ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. కమిషనర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన పోలీసులు, ఎస్ఐపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి, ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

స్నేహితులను విడిచివెళ్లలేక బాలిక ఆత్మహత్య

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మెరుగైన చదువుల కోసం మరో స్కూలులో చేర్పించడంతో చిన్ననాటి నుంచి కలిసి చదివిన క్లాస్‌మేట్స్‌కు దూరమవుతున్నాననే బాధతో ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తిరువారూరు జిల్లా వైప్పూరు గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన డ్రైవర్ కుమార్తె విజయశ్రీ (13) ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆమెను మెరుగైన చదువుల కోసం తిరువారూరు బాలికల మహోన్నత పాఠశాలలో చేర్పించారు. దీంతో ఎనిమిదేళ్లుగా కలిసి చదివిన తన స్నేహితులను విడిచిపెడుతున్నాననే బాధతో విజయశ్రీ దిగులు చెందింది. గురువారం వేకువజాము ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలిక హత్య కేసు...

నిందితులకు కస్టడీ పొడిగింపు

పుదుచ్చేరి, మార్చి 14: పుదుచ్చేరిలో బాలిక హత్యాచారం కేసులో అరెస్టయిన కరుణాస్ (19), వివేకానందన్ (59) అనే నిందితులకు జ్యూడీషియల్ కస్టడీని కోర్టు మరో 15 రోజుల పాటు పొడగించింది. ఈ నెల 5వ తేదీన బాలికపై అత్యాచారం, హత్య జరిగింది. ఈ కేసులో నిందితుల కస్టడీ గురువారంతో ముగియడంతో వారిని కోర్టులో హాజరుపరచగా మరో 15 రోజుల పాటు కస్టడీని పొడిగిస్తూ ఆదేశించింది.

మహిళా అధికారి భర్త ఆత్మహత్య

అడయార్, మార్చి 14: షేర్ మార్కెట్ వ్యాపారంలో అపారనష్టం రావడంతో ప్రభుత్వ అధికారి భర్త ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం వెలుగులోకి వచ్చిన ఈ విషాదకర ఘటన వివరాలను పరిశీలిస్తే, స్థానిక తండయారుపేట, కార్పొరేషన్ కాలనీకి చెందిన దివ్య (35) మద్రాస్ హైకోర్టులో ఉన్నతాధికారిగా పనిచేస్తున్నారు. ఈమెకు లక్ష్మణన్ (37)తో నాలుగేళ్ళ క్రితం వివాహం కాగా, మూడేళ్ళ కుమార్తె ఉంది. కాగా లక్ష్మణన్ షేర్ మార్కెట్ వ్యాపారం చేస్తున్నారు. ఇందులో ఆయన భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ షేర్ మార్కెట్‌లో అపారనష్టం రావడంతో లక్ష్మణన్ ఇంటిలోనే ఉరేసుకున్నాడు. దీన్ని గమనించిన భార్య స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో అక్కడకు వచ్చిన పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వేలూరు నుంచి పోటీ చేస్తున్నా

● సినీ నటుడు మన్సూర్ అలీఖాన్

అడయార్, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తమ పార్టీ టిక్కెట్ ఇవ్వకపోయినప్పటికీ తాను వేలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నట్టు సినీ నటుడు, ఇండియా జననాయక పులిగల్ కట్చి వ్యవస్థాపకుడు మన్సూర్ అలీఖాన్ ప్రకటించారు. ఆయన గురువారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ, తన దగ్గర అనేక మంది రుణం తీసుకున్నారు, కానీ, తాను ఇప్పటివరకు తాను ఒక్కరి వద్ద కూడా అప్పు తీసుకోలేదన్నారు. తన వద్ద రుణం తీసుకున్న వారిలో చాలా మంది ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదన్నారు. అలాంటి చరిత్ర ఉన్న తనను కొందరు రాజకీయ నేతలు హేళనగా మాట్లాడుతున్నారన్నారు. 'ఇలాంటి వ్యక్తిని అన్నాడీఎంకేలో చేర్చుకుని ఎంపీ సీటు కేటాయించడమా? అని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. అన్నాడీఎంకే అనే పెద్ద పార్టీతో తమ పార్టీ పొత్తు పెట్టుకునేందుకు చర్చలు జరిపిందన్నారు. ఈ చర్చల్లో తమ పార్టీకి వేలూరు ఎంపీ సీటును ఇవ్వాలని కోరగా, ఇప్పటివరకు వారు ఎలాంటి సమాధానం చెప్పలేదని, అయినప్పటికీ తమ పార్టీకి అన్నాడీఎంకే సీటు కేటాయించినా, కేటాయించకపోయినా తాను మాత్రం వేలూరు లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

రెండ్రోజుల్లో నియోజకవర్గాల జాబితా విడుదల

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీచేయనున్న నియోజకవర్గాల జాబితా విడుదల చేస్తామని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై ప్రకటించారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్ వద్ద గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే కూటమి ఘనవిజయం సాధించడం ఖాయమని, పుదుచ్చేరి సహా 40 స్థానాలను గెలుచుకుంటుందని చెప్పారు. డీఎంకే కూటమిలో కాంగ్రెస్‌కు కేటాయించిన పది సీట్లలో ఈ సారి కొన్ని నియోజకవర్గాలు మారే అవకాశం కూడా ఉందని చెప్పారు. డీఎంకే అధిష్టానవర్గంతో మరో విడత చర్చలు జరిపి నియోజకవర్గాల జాబితా ఖరారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ పదే పదే రాష్ట్రంలో పర్యటించడం వింతగా ఉందన్నారు. మోదీ పాల్గొనే సభల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి అమలు చేసిన పథకాలు గురించి నోరుమెదపకపోవడం గర్హనీయమన్నారు.

ఓపీఎస్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు

● మాజీ మంత్రి జయకుమార్

పెరంబూర్, మార్చి 14: రెండాకులు గుర్తు తమకే అంటూ మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం మాటలకు పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. ఈ మేరకు నగరం లో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... మాదకద్రవ్యాల తరలింపుకు సంబంధించి ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని ఎడప్పాడి పళనిస్వామి కోరారని, ఇప్పటివరకు ఆ విషయమై స్పందించకుండా, ఆయనపై పరువు నష్టం కేసు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డీఎంకే మూడేళ్ల పాలనలో ప్రతిపక్షాలపై కేసులు బనాయించడమే విధిగా పెట్టుకుందని విమర్శించారు. తమపై ఎన్ని కేసులు పెట్టిన చట్టపరంగా వాటిని ఎదుర్కొంటామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కూటమి ఏర్పాటుపై పలు పార్టీలతో చర్చలు ప్రశాంతంగా సాగుతున్నాయని, త్వరలోనే కూటమిపై ప్రకటిస్తామని జయకుమార్ తెలిపారు.



చెన్నై రిప్పన్‌భవన సముదాయంలోని పరిపాలనా భవనంపై ఏర్పాటు చేసిన 'ముత్తమిళ్‌అరింజర్ కలైంజర్ కరుణానిధి మాళిగై' నేమ్‌బోర్డు ఆవిష్కరిస్తున్న నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ.



నాలుగు శాతం కరవుభత్యం పెంచినందుకు సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను కలుసుకుని ధన్యవాదాలు తెలుపుతున్న వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు.


ఆలయ ముఖమండపం


ఆలయ ప్రవేశద్వారం

ఆధ్యాత్మికం


ఆలయం లోపలి మండపం

క్షీరసాగరంలో వైకుంఠనాథుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై శేషతల్పంపై శయనించి భక్తులను అనుగ్రహిస్తుంటారు. అయితే లక్ష్మీనాథుడిగా పేరుపొందిన ఆ పెరుమాళ్ కడల్‌మల్లైలో కటికనేలపై శయనించి భక్తులను అనుగ్రహిస్తున్నారంటే అందరికీ విస్మయం కలుగుతుంది. ఇంతకీ ఆ కడల్‌మల్లై ఎక్కడుందో తెలుసా? పల్లవుల కాలంనాటిది, శిల్పాలకు నెలవుగా, చారిత్రక నగరంగా పేరుగడించిన మహాబలిపురం ప్రాచీన నామమే 'కడల్‌మల్లై'. చారిత్రక శిల్పకళా వైభవాన్ని ఎలుగెత్తి చాటే మహాబలిపురం బస్టాండుకు కూత వేటు దూరంలో ఉన్న ప్రాచీన ఆలయంలోనే మహావిష్ణువు కటికనేలపై శయనిస్తూ స్థలశయనపెరుమాళ్‌గా భక్తకోటిని అనుగ్రహిస్తున్నారు. తనను దర్శించే భక్తుల కోర్కెలను నెరవేరుస్తున్నారు. అష్టైశ్వర్యాలను అందిస్తున్నారు..

- ఆంధ్రజ్యోతి, చెన్నై

సకల సంపదలనిచ్చే స్థలశయన పెరుమాళ్


• 16వ శతాబ్దపు అద్భుతాలయం



స్థలపురాణం

పూర్వం మహాబలిపురం అంతా దట్టమైన అటవీ ప్రాంతం ఉండేది. ఆ అరణ్యాలలో ఎందరో మహర్షులు తపస్సు చేశారు. వారిలో మహావిష్ణువుపై అతీత భక్తిని కలిగిన పుండరీక మహర్షి ఒకరు. ఓ పర్యాయం వనంలో సంచరిస్తున్న పుండరీక మహర్షికి ఓ కొలనులో అందమైన తామర పుష్పం కనిపించింది. ఆ తామరను పాలకడలిపై శయనించే మహావిష్ణువు పాదాలకు సమర్పించాలని నిర్ణయించారు. ఆ తామర పూవుతో బయలుదేరిన ఆ మహర్షికి సముద్రం ఎదురైంది. ఆ కడలిలో దారిని ఏర్పరచుకుని వెళ్ళాలని సంకల్పించారు. వెంటనే 'ఓ పరంధామా నీపై నాకున్న భక్తి నిజమయితే ఈ సముద్రంలోని నీరంతా ఇంకిపోవాలి' అంటూ గట్టిగా నినాదం చేసి తామరపుష్పాన్ని ఓ చోట ఉంచి, తన రెండు చేతులతో కడలి నీటిని తోడసాగారు. పట్టువిడువకుండా పుండరీక మహర్షి కడలి నీరంతా ఇంకిపోయేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని చూసి సంతసించిన మహావిష్ణువు వృద్ధుడి రూపంలో ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యారు. పుండరీకుడి వద్దకు వెళ్ళి 'అయ్యా! తీరని ఆకలితో ఉన్నాను. ఊరిలోకి వెళ్ళి తినడానికి ఏవైనా తీసుకురండి. అంత వరకూ నేనీ కడలిని తోడుతాను' అని అన్నారు. ఆ విధంగానే వృద్ధుడి రూపంలో ఉన్న మహావిష్ణువు కడలిని రెండు చేతులతో తోడసాగారు. పుండరీక మహర్షి ఊరిలోకి వెళ్ళి ఆ వృద్ధుడి కోసం ఆహారంతో తిరిగొచ్చారు. ఆ వద్ధుడు కనిపించలేదు. అదే సమయంలో ఆ ప్రాంతంలోని కడలి నీరంతా ఇంకిపోయి ఉండటం, ఆ నేలపై భుజగశయనుడైన నారాయణుడు శయన భంగిమలో దర్శనమిస్తుండటం చూసి ఆ మహర్షి సంతసించారు. తాను తెచ్చిన కమలాన్ని స్వామి వారి పాదాలకు సమర్పించారు. ఆ భంగిమలోనే ఆ చోట భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించాలని మహావిష్ణువును ప్రార్థించారు. 'తథాస్తు' అన్నాడు పరంధాముడు. పుండరీక మహర్షి కోసం పెరుమాళ్ కడలినీటిని తోడిన స్థలం కనుక ఈ క్షేత్రానికి 'అర్ధ సేతు' అనే పేరొచ్చింది. ఇక్కడ స్నానమాచరిస్తే రామేశ్వరంలోని అగ్నితీర్థంలో స్నానమాచరిస్తే లభించే పుణ్యఫలాలు ప్రాప్తించడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెబుతారు.


శ్రీదేవి, భూదేవి సమేత స్థల శయనపెరుమాళ్


మూలవిరాట్టు రేఖాచిత్రం


నీలమంగై తాయార్

ఆలయ విశేషాలు...

ప్రతియేటా మాసిమఖం పౌర్ణమి రోజు స్థలశయన పెరుమాళ్ గరుడవాహనంపై సముద్రతీరానికి తీర్థవారిగా వేంచేస్తారు. ఆ సమయంలో వేలాదిమంది భక్తులు కడలిలో స్నానమాచరిస్తారు. తమిళ మాసమైన చిత్తిరైలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయం నుంచి సముద్రతీరానికి వెళ్లే మార్గంలో కనిపించే పుండరీక పుష్కరిణిలో తీర్థవారి, ఉత్సవర్లకు మొదటి రోజు తెప్పోత్సవం వైభవంగా జరుగుతాయి. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 6.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ప్రాచీన ఆలయం...

పుండరీక మహర్షి సంతోషం కోసం మహావిష్ణువు కటిక నేలపై శయనుడైనందున ఆయనకు 'స్థలశయన పెరుమాళ్' అనే పేరొచ్చింది. అలవాయ కోయిల్ అని పేరుగడించిన మహాబలిపురం సముద్రతీర ఆలయం క్రీ.శ. ఏడో శతాబ్దంలోనే తిరుమాళ్ తిరుమేనిని ప్రతిష్ఠించి పూజలు కూడా నిర్వహించేవారు. కడలి ఉధృతి వల్ల, పల్లవులపై ప్రత్యర్థులు చేసిన దాడుల వల్ల ఏడు ఆలయాల ప్రాంతంగా కీర్తినొందిన మహాబలిపురంలో ఆరుఆలయాలు కనుమరుగై, ప్రస్తుతమున్న సముద్రతీర ఆలయం మాత్రమే మిగిలింది. ఈ సముద్రతీర ఆలయంలో నిత్యపూజాది కార్యక్రమాలు ఆగిపోవడంతో పదహారో శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల వంశీకుడైన పరాంకుశ చక్రవర్తి ఊరి నడుమ ఆ ఆలయాన్ని నిర్మించి, అందులో స్థల శయన పెరుమాళ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఆలయ వైభవం...

మహాబలిపురం బస్టాండు సమీపంలోనే ఈ ఆలయం ఉంది. నాలుగుకాళ్ల మండపం, ఐదంతస్థులతు కలిగిన రాజగోపురాన్ని దాటుకుని లోపలి ప్రాకారంలోకి అడుగుపెడితే దీప స్తంభం, బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడాళ్వార్ సన్నిధి దర్శనమిస్తాయి. స్తంభాలు కలిగిన అర్ధ మండపాన్ని దాటుకుని వెళితే గర్భాలయంలో స్థలశయన పెరుమాళ్ కనువిందు చేస్తారు. స్వామివారి పాదాల చెంత విరబూసిన తామరపుష్పం కూడా ఉంటుంది. ఆ పుష్పాన్ని సమర్పించిన పుండరీక మహర్షి శ్రీవారి పాదాలకు చేరువగా మొక్కుతున్న భంగిమలో కనిపిస్తారు. చతుర్భుజాలు కలిగిన మూలవర్లు ఓ చేతిపై శిరస్సును ఆనించుకుని మరో చేతిని తన దర్శనానికి వచ్చే భక్తులను ఆహ్వానించే విధంగా దర్శనమిస్తారు. మరో రెండు చేతలు నేలపై ఆనించి ఉన్నాయి. కడలినీటిని తోడాలని కంకణం కట్టుకున్న పుండరీక మహర్షిని అనుగ్రహించేందుకు క్షీర సాగరం నుండి లేచి ఆగమేఘాలపై రావటంతో స్వామి వారి నాభిపై బ్రహ్మదేవుడు లేరు. ఇష్టదేవేరులైన శ్రీదేవి, భూదేవి కూడా కనిపంచరు. శంఖు, చక్రాయుధాలు కూడా ఉండవు. ఇవేవీ లేకుండా నిరాడంబరుడిలా దర్శనమిచ్చే స్థల శయనపెరుమాళ్ అందాలను వీక్షించడానికి వేయికనులు చాలవు. మూలవర్లకు ఎదుట శ్రీదేవీ, భూదేవి సమేతుడైన చతుర్భుజాలతో ఉత్సవమూర్తి దర్శనమిస్తారు. నిండైన మనస్సుతో ప్రకారాన్ని ప్రదక్షిణం చేస్తే తాయార్ సన్నిధిలో తళతళా మెరిసే ముక్కుపుడక, నుదుట తిలకంతో 'మగళనాయకి'గా దర్శనమిస్తారు. నీలమంగై తాయార్, ఉత్సవ తయార్ ఇరువైపులా ఏనుగులు తొండాలను పైకెత్తి నమస్కరిస్తున్న భంగిమలో కనిపిస్తాయి. వాయవ్యదిశలో అలంకారరూపిణిగా ఆండాల్ (గోదాదేవి) కొలువై ఉన్నారు. ఆండాళ్‌కు నమస్కరించి ప్రాకారాన్ని ప్రదక్షిణ చేస్తుంటే లక్ష్మీనాచ్చియార్ సన్నిధి కనిపిస్తుంది. లక్ష్మీదేవి ఒడిలో మూలవర్లు, ఉత్సవర్లు దర్శనమిస్తారు. భూదత్తాళ్వార్ అవతరించిన క్షేత్రం కనుక ఆలయంలో ఆయనకు ప్రత్యేక సన్నిధి కూడా ఉంది. ఏడో శతాబ్దంలో అవతరించిన ఆయన ఈ తిరుక్కడల్‌మల్లై (మహాబలిపురం) సహా పదమూడు వైష్ణవ దివ్యదేశాలపై మంగళాశాసనాలొనర్చారు. ఇదే విధంగా తిరుమంగై ఆళ్వార్ కూడా ఈ క్షేత్ర మహిమను గురించి మంగళాశాసనమొనర్చారు. ఇక ఆలయం వెలుపలి ప్రాకారంలో ఆంజనేయస్వామి, శ్రీరామచంద్రమూర్తి, భూదత్తాళ్వార్, గరుడాళ్వార్, లక్ష్మీనరసింహస్వామి వేర్వేరు సన్నిధుల్లో దర్శనమిస్తారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధి ఎదుటనున్న కుడ్యంపై ఆ స్వామివారి 'రుణవిమోచన స్తోత్రం' చెక్కబడి ఉంది. స్వామివారి నక్షత్ర దినాలు, ప్రదోష కాలాలు, మంగళ, ఆదివారాల్లో అత్తిరసాల మాలను ధరింపజేసి, పానకాన్ని నైవేద్యంగా సమర్పించి నేతి దీపాన్ని వెలిగించి ఈ రుణవిమోచన స్తోత్రాన్ని పారాయణం చేస్తే రుణబాధలు పటాపంచలవుతాయని వైష్ణవ పండితోత్తములు చెబుతున్నారు.

కల్కి అవతారం... : కలియుగాంతంలో తాను ధరించే కల్కి అవతార విశేషాలను ఇక్కడి స్థల శయనపెరుమాళ్ ముందుగానే తిరుమంగై ఆళ్వార్‌కు ప్రదర్శింపజేశారు. జ్ఞానదృష్టితో ఆ కల్కి అవతారాన్ని వీక్షించి తిరుమంగై ఆళ్వార్ తన పాశురంలో ఆ అవతార విశేషాలను చక్కగా వర్ణించారు. ఈ సంఘటనను బట్టి ఇక్కడి స్థల శయనపెరుమాళ్ స్వామివారే ఈ కలియుగాంతాన కల్కి అవతారం దాల్చనున్నట్లు సుస్పష్టమవుతోంది.

ఎలా వెళ్ళాలి? : చెన్నై నగరం నుండి 55 కి.మీల దూరంలో ఉన్న మహాబలిపురానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సుల్లో వెళ్ళవచ్చు. చెంగల్పట్టు నుండి 30 కి.మీల దూరంలో, తిరుప్పోరూరు, తిరుక్కళికుండ్రం ప్రాంతాలకు 15 కి.మీ. దూరంలో ఉన్న మహాబలిపురానికి బస్సులు నడుపుతున్నారు. మహాబలిపురం బస్టాండుకు కూతవేటు దూరంలో ఉన్న స్థలశయన పెరుమాళ్ ఆలయానికి ఆటోలో వెళ్లవచ్చు.


భూదత్తాళ్వారు

నేడు పలు చిన్న చిత్రాలు రిలీజ్

మార్చి మూడో శుక్రవారం చిన్న బడ్జెట్ చిత్రాలు విడుదలకానున్నాయి. వాటిలో సముద్రఖని, యోగిబాబు కలిసి నటించిన 'యావరుం వల్లవరే', ఆర్కే సురేష్ హీరోగా నటించిన 'కాడువెట్టి', మాస్టర్ మహేంద్రన్ కథానాయకుడిగా నటించిన 'అమిగో గ్యారేజ్', అనిష్, ముత్తుప్రియన్, మనిషాజిత్ నటించిన 'ఆరాయిచ్చి' తదితర చిత్రాలు విడుదలవుతున్నాయి. అలాగే, మలయాళం బ్లాక్ బస్టర్ హిట్ మూవీ 'ప్రేమలు' మూవీని కూడా తమిళంలోకి అనువాదం చేసి విడుదల చేస్తున్నారు. ఇప్పటికే తమిళంలోకి అనువాదమై విడుదలైన 'మంజుమల్ బాయిస్' చిత్రం సూపర్‌హిట్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శించబడుతున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో నేడు చిన్న బడ్జెట్‌తో తెరకెక్కిన పలు తమిళ చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. వీటిలో ఏ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారో వేచిచూడాల్సివుంది. వీటితో పాటు హిందీ చిత్రం 'బస్తర్', తెలుగు చిత్రం 'రజాకర్' ఉన్నాయి. నిజానికి ఈ యేడాది ప్రారంభమై 75 రోజులకు పైగా గడిపోయింది. కానీ, ఇప్పటివరకు ప్రేక్షకులను అలరించేలా భారీ బడ్జెట్ చిత్రం రాకపోవడం గమనార్హం.


'యావరుం వల్లవరే'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

తలైవర్‌కు ఎన్నటికీ రుణపడివుంటా

• రితికా సింగ్

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వేట్టయ్యాన్' చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన తలైవర్‌కు జీవితాంతం రుణపడివుంటానని నటి రితికా సింగ్ అన్నారు. ఇదేవిషయంపై ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'సూపర్‌స్టార్ రజినీకాంత్‌లోని ప్రేమ, దయాగుణం సాటిలేనివి. అలాంటి వ్యక్తితో కలిసి పనిచేస్తున్నాను. ఈ అవకాశం కల్పించినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె రజినీకాంత్‌తో కలిసి దిగిన ఒక ఫొటోను కూడా షేర్ చేశారు. కాగా 'వేట్టయ్యాన్' చిత్రంలో రజినీకాంత్‌తో పాటు అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్, రితికా సింగ్, తుషారా విజయన్ తదితరులు నటిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తిరునెల్వేలి, కన్నియాకుమారి తదితర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తిచేసుకుని, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆర్‌ఎఫ్‌సీలో షూటించ జరుగుతోంది. ఈ సినిమా షూటింగ్ 70 నుంచి 80 శాతం మేరకు పూర్తయినట్టు ఇటీవల హీరో రజినీకాంత్ మీడియాకు వెల్లడించిన విషయం తెల్సిందే.


రజినీకాంత్‌తో రితికా సింగ్

అభిమానులతో శివకార్తికేయన్ సందడి

తన అభిమానులతో హీరో శివకార్తికేయన్ ప్రత్యేకంగా భేటీఅయ్యారు. పోరూర్‌లోని ఓ కల్యాణమండపంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి ఎస్కే అభిమానులు హాజరయ్యారు. వారితో ఆయన మాట్లాడారు. తన కష్టనష్టాలను చెప్పుకునేందుకు తల్లిదండ్రులు లేరని, సంతోషకమైనా, దుఃఖమైనా మీతోనే పంచుకుంటానని చెప్పారు. ఈ తర్వాత ఆయన తన అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. వారితో కలిసి విందుభోజనం చేశారు. కాగా, తమిళ చిత్రపరిశ్రమలో ప్రముఖ హీరోగా గుర్తింపుపొందిన శివకార్తికేయన్ నటించిన చిత్రాలు కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో 'అమరన్' అనే పేరుతో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అగ్ర నటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్నారు. అలాగే, ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో కూడా ఆయన ఓ చిత్రం చేస్తున్నారు.


తన అభిమానులతో శివకార్తికేయన్

వనమా ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

• ప్రముఖ నర్తకి డా.స్వర్ణమాల్య

ప్యారీస్, మార్చి 14: సాహిత్యం, కళలు, విద్య, భారతీయ సంస్కృతి, సంప్రదాయం తదితర రంగాల్లో వనమా ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ప్రముఖ నర్తకీమణి, కేరళ యూనివర్సిటీ గ్లోబల్ ఆర్ట్స్ ప్రొఫెసర్ డా.స్వర్ణమాల్య కొనియాడారు. విజయవాడకు చెందిన మాజీ ఎమ్మెల్సీ వనమా శివదుర్గాప్రసాద పుల్లారావు, ప్రముఖ గాయని జ్ఞానప్రసూన దంపతుల పేరుతో స్థాపించిన వనమా ఆర్ట్స్, మద్రాసు వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంత్రోపాలజీ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ ప్రాంగణంలోని ఎఫ్-50 హాలులో కల్చరల్ అండ్ క్రాస్ రోడ్స్ అనే అంశంతో ఏర్పాటుచేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ఉదయం ప్రారంభమైంది. మద్రాసు వర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డా.ఎస్.ఏలుమలై ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పెరుగుతున్న ఈ రోజుల్లో వాటికి అంకితమైన విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా తమ తల్లిదండ్రుల పేరుతో నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హిస్టారికల్ స్టడీస్ విభాగాధిపతి, సదస్సు కో-కన్వీనర్ డా.ప్రభుకుమారి వనమా వర్సిటీతో కలిపి నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం డా.స్వర్ణమాల మాట్లాడుతూ... విద్యార్థులు, యువ కళాకారులు, తమ లాంటి సీనియర్ కళాకారులను ప్రోత్సహించే విధంగా వనమా ట్రస్ట్ సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వర్సిటీ ఆంత్రోపాలజీ విభాగాధిపతి డా.ఎంపీ దామోదరన్‌తో కలసి ప్రభుకుమారి అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోవడంతో కోల్‌కత్తా నుంచి ఆంత్రోపాలిజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్, ప్రొఫెసర్ డా.బీవీ శర్మ, న్యూజిలాండ్ నుంచి డా.టి.చంద్రలేఖ ఆన్‌లైన్ ద్వారా రెండు రోజుల సదస్సు విజయవంతం కావాలని కాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్వర్ణమాల్యను సత్కరిస్తున్న డా.ప్రభుకుమారి, డా.ఎంపీ దామోదరన్



విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ దృశ్యం

తమిళనాడు ఆవిష్కరణలకు, పెట్టుబడులకు స్వర్గధామం

• ఆర్థిక శాఖ కార్యదర్శి

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలకు, పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గధామమని రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శి టి.ఉదయచంద్రన్ పేర్కొన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) 'తమిళనాడు - ది స్టేట్ ఆఫ్ ద ఫ్యూచర్' పేరుతో గురువారం చెన్నైలో నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఉదయచంద్రన్ 'తమిళనాడు ఎట్ 100 విజన్' పేరుతో రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి రంగంలో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. తమిళనాడు దేశంలోనే అత్యుత్తమ ఈవీ ప్లేయర్‌గా విజయవంతంగా పరివర్తన చెందిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ వి.కామకోటి, సీఐఐ తమిళనాడు చైర్మన్ శంకర్ వానవరాయర్, డిప్యూటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్.నందిని, వైస్ చైర్మన్ శ్రీవాత్స్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో 'అవిరా డైమండ్స్' షోరూం

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో 'అవిరా డైమండ్స్' షోరూం ఏర్పాటైంది. దీనిని వెటరన్ క్రికెటర్ బ్రావో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు సురేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవిరా డైమండ్స్ నూతన యుగపు ఆభరణాల బ్రాండ్ అని, దేశంలో స్థిరమైన, వినూత్న ఆభరణాల రూపకల్పనలో అగ్రగామిగా వుందని వివరించారు. ఎన్నో ప్రయోగాల అనంతరం తమ వినియోగదారులకు ప్రపంచ స్థాయి నాణ్యమైన వజ్రాలను అందిస్తున్నామన్నారు. సరసమైన ధరల్లో అనేక రకాల ఆభరణాలను తీసుకువస్తున్నామని పేర్కొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న బ్రావో

ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక గస్తీ బృందం

చెన్నై, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం వద్ద ప్రయాణికులను, వారి సహాయకులను, లగేజీలను కాపాడేందుకు సునిశిత శిక్షణ పొందిన పదిమంది కానిస్టేబుళ్లతో ప్రత్యేక విమానాశ్రయ పోలీసు గస్తీ బృందం ఏర్పాటైంది. ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ గస్తీ బృందాన్ని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ గురువారం ప్రారంభించారు. విమానాశ్రయం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ గస్తీ పోలీసుల బృందం కోసం రెండు పెట్రోలింగ్ వాహనాలు, ఓ బ్యాటరీ వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక పోలీసు గస్తీ బృందం షిప్ట్ పద్ధతిలో 24 గంటలపాటు ప్రయాణికులకు భద్రత కల్పిస్తారని చెప్పారు. వృద్ధులకు, విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అందించిన వారికి సాయం చేస్తారని తెలిపారు. అదే విధంగా విమాన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేలా టాక్సీలు, ఆటోలను కూడా అద్దెకు కుదిర్చి పంపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సీవీ దీపక్, అదనపు పోలీసు కమిషనర్ (సౌత్) ప్రేమ్ ఆనంద్ సిన్హా, డిప్యూటీ కమిషనర్లు ఎంఆర్ శిబిచక్రవర్తి, (సౌత్‌జోన్), మహేష్‌కుమార్ (సౌత్ ట్రాఫిక్ విభాగం), కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం ఉపాధ్యక్షుడు కేవీకే శ్రీరామ్, సెయింట్ థామస్ మౌంట్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయం వద్ద ప్రత్యేక గస్తీ సేవల ప్రారంభోత్సవంలో బ్యాటరీ వాహనాన్ని ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్


చెన్నై మింట్ ప్రాంతంలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకాలపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన అంశాలను వివరిస్తున్న నగరాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కాకర్ల ఉష


చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకున్న ఇటీవల జర్మనీలో జరిగిన పాకశాస్త్ర ప్రావీణ్య పోటీల్లో స్వర్ణపతకం గెలుచుకున్న విద్యార్థిని శ్రేయా అనీస్, అమ్మతాస్ హోటల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ భూమినాథన్, సీఈజీ కవిత తదితరులు